
సాక్షి
ఒడిశా
గురువారం । 25 । జనవరి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు రూ.3,65,591
బంగారం 1 గ్రాము 600 మిల్లీ గ్రాములు
వెండి 26 గ్రాముల 800 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ



కాంగ్రెస్ గూటికి బలభద్ర మాఝి

ఇటీవల బిజూ జనతా దళ్‌ను వీడిన మాజీ మంత్రి బలభద్ర మాఝి బుధవారం కాంగ్రెసు గూటికి చేరారు.

- 10లో



'ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి'

గజపతి జిల్లాలో తితిలీ తుఫాన్ ప్రభావంతో నిరాశ్రయులైన ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు.

- 10లో

న్యూస్‌రీల్

ఎలుగు పిల్ల స్వాధీనం



ఎలుగు పిల్ల

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమీపంలో ఉన్నటువంటి అడవుల వద్ద ఒక ఎలుగు పిల్లను అటవీ శాఖ సిబ్బంది బుధవారం స్వాధీనం చేసుకున్నారు. తన తల్లి నుంచి వేరైన ఎలుగు పిల్ల తిరుగుతుండగా అటవీ సిబ్బందికి కనిపించింది. దీనిని స్వాధీనం చేసుకున్న సిబ్బంది రేంజ్ కార్యాలయంలో ఉంచారు. ఈ పిల్లను కొద్దిరోజుల పాటు ఉంచిన అనంతరం తిరిగి అడవుల్లో విడిచి పెడతామని అటవీ శాఖ రేంజ్ అధికారి నరసింహ సతపతి తెలియజేశారు.

రైల్వే సీఆర్ఎస్ పర్యటన



పనులు పరిశీలిస్తున్న సీఆర్ఎస్ మిశ్రా

రాయగడ: విశాఖపట్నం రైల్వే కమిషనర్ ఫర్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) బీకే మిశ్రా(విశాఖపట్నం డివిజన్) రాయగడలో బుధవారం పర్యటించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో కొత్తగా నిర్మితమవుతున్న అభివృద్ధి పనులను ఆయన పర్యవేక్షించారు. అదేవిధంగా సింగపూర్ రోడ్డు నుంచి రాయగడ వరకు జరిగిన మూడో లైన్ నిర్మాణం పనులను పరిశీలించారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు రైల్వే శాఖ కృషి చేస్తోందని వెల్లడించారు. ఆయనతో పాటు డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, డివిజనల్ కమర్షియల్ మేనేజర్ (విశాఖపట్నం) కేకే త్రిపాఠి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

జనజాతి గౌరవ యాత్ర ప్రారంభం నేడు

జయపురం: వనవాసీ కల్యాణ ఆశ్రమం ఒడిశా ద్వారా జయపురంలో జనజాతి గౌరవ యాత్ర గురువారం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలియజేశారు. జనజాతి సంస్కృతి పరిరక్షణ, హక్కుల సంరక్షణ కోసం యాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం 5.30 గంటలకు జయపురం సూర్యమహల్ వద్ద యాత్రను ప్రారంభించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వనవాసీ కల్యాణ ఆశ్రమం జయపురం పట్టణ అధ్యక్షుడు శోభిషణ పట్నాయక్, జయపురం రాణి సారిక దేవి(జయపురం మహారాజు విక్రమదేవ్ వర్మ మనుమడి భార్య), రాష్ట్రీయ స్వయం సేవక సంఘం జయపురం కో–ఆర్డినేటర్ డాక్టర్ నిరంజన్ మిశ్రలు పాల్గొంటారని వనవాసీ కల్యాణ ఆశ్రమం జయపురం కార్యదర్శి లక్ష్మీకాంత మిశ్ర వెల్లడించారు. అనంతరం శుక్రవారం ఉదయం కుంద్ర, కలియగుడ, జీరాగుడ, భూషింగగుడ, గిర్లిగుడ, కొరాపుట్, జయపురంలో, 27వ తేదీన బిజ, బడేల్, జోలాపుట్‌లలో యాత్ర ఉంటుందని తెలియజేశారు.

గ్రామాల్లో ఎంపీ సప్తగిరి పర్యటన



గ్రామాల్లో పర్యటిస్తున్న ఎంపీ ఉలక, పంగి తదితరులు

రాయగడ: కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలక గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఆయన గ్రామాల్లో పర్యటించి ఓటర్లు, కార్యకర్తలను చైతన్యవంతులు చేస్తున్నారు. దీనిలో భాగంగా జిల్లా పరిధిలోని ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన కెరడ, కంచికవలస, బిలేసు, గజ్జిగాం, ఇరుకుబడి, పితామహాల్, తడమ తదితర ప్రాంతాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఆయనతో పాటు కొరాపుట్ మాజీ ఎంపీ జయరాం పంగి, పీసీసీ ప్రధాన కార్యదర్శి దుర్గా ప్రసాద్ పండ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అప్పలస్వామి కద్రక, పూజా ఉలకలు ఉన్నారు. గ్రామాల్లో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. ప్రతీ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని సూచించారు.

మూఢ నమ్మకాలతో..

మరణ శాసనం

- మంత్రగాళ్లను ఆశ్రయిస్తున్న గిరిజనులు
- చేతబడి నెపంతో హత్యలు, బహిష్కరణలు
- ఆస్పత్రులకు వెళ్లకుండా నాటువైద్యం



బరంపురం: ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. మానవుడు తాను కనుగొంటున్న సరికొత్త టెక్నాలజీతో చంద్ర మండలానికి సైతం వెళ్లేందుకు సాహసం చేస్తున్నాడు. ప్రపంచంలో ఏ క్షణం ఏం జరుగుతుందో అరచేతిలోనే తెలుసుకుంటున్నాడు. అల్పిన్ నుంచి ఆటమ్ బాంబు వరకు కనుగొని తన సత్తా చాటుకున్నాడు. ఈ జీవ ప్రాణులన్నింటిలో మనిషి మహా జ్ఞానవంతుడిగా నిరూపించుకున్నాడు. కానీ ఇటువంటి సమయంలోనూ ఇంకా మూఢ నమ్మకాల వలలో చిక్కుకొని సతమతమవుతున్నాడు. చేతబడి(సిల్లంగి) వంటివి నమ్ముతూ సాటి మనిషిని అనుమానిస్తున్నాడు. ఇటీవల సాక్షాత్తు గంజాం జిల్లాలో చేతబడి పేరుతో జరిగిన హత్యలు, అరెస్టులు, గ్రామ బహిష్కరణలు వంటి దారుణ ఘటనలే దీనికి ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఇటువంటి దారుణాలు గంజాం జిల్లా లో అధికంగా చోటుచేసుకుంటున్నాయి.

మంచం తిప్పి గుర్తిస్తారు

జిల్లాలోని మారుమూల గ్రామాల్లో ఎక్కడైనా వరుసగా గ్రామస్తులు మృతి చెందితే చేతబడి వల్లే మృతి చెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. అప్పుడు ఆయా గ్రామాల్లో గ్రామ పెద్ద ఆదేశంతో గ్రామస్తులు ఒక పట్టె మంచం తిప్పుతారు. ఏ ఇంటి దగ్గర ఆ మంచం ఆగిపోతుందో ఆ ఇంటిలో చేతబడి చేసిన వ్యక్తి ఉన్నట్లు నిర్ధారించి ఇంటిలో ఉన్నవారిని గ్రామ బహిష్కరణ చేస్తారు. లేకుంటే గ్రామం మధ్య కట్టేసి గుండు గీయించి చిత్ర హింసలు పెట్టి చంపేస్తారు.



మాట్లాడుతున్న ఎస్పీ జగ్‌మోహన్ మీన

ఇటీవల జరిగిన ఘటనలు...

గత నెల 1వ తేదీన జిల్లాలో కవిసూర్యనగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని జోకరి గ్రామంలో 10 సంవత్సరాల వయస్సు కలిగిన ఇద్దరు శిశువులు వరుసగా మృతి చెందారు. చేతబడి వలనే ఇద్దరు శిశువులు మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానించి, గ్రామంలో పట్టె మంచం తిప్పారు. పోలీసులు కూడా గ్రామంలోకి రాకుండా గ్రామం చుట్టూ గ్రామస్తులు కాపలాకాశారు. చివరికి మూడు రోజుల తర్వాత పోలీసులు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. అదేవిధంగా గత నెల 15వ తేదీన పట్టపూర్ పోలీసుస్టేషన్ పరిధి టి.రవీంద్రపూర్ గ్రామంలో నివసిస్తున్న గర్భవతిని ప్రసవ సమయంలో ఆస్పత్రికి తీసుకెళ్లకుండా గ్రామస్తులు మంత్రగాడి దగ్గరికి తీసుకెళ్లారు. దీంతో మంత్రగాడి వద్ద ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. ఇదే విధంగా 18వ తేదీన జిల్లాలోని కవిసూర్యనగర్ బ్లాక్ దేవ్ గ్రామంలో చేతబడి చేస్తున్నాడని అనుమానంతో ఒక మంత్రగాడిని గ్రామస్తులు చితకబాది సగం గుండు చేసి గ్రామంలో తిప్పారు. మంత్రగాడి నుంచి మనిషి కపాలం, ఎముకలు తదితర పూజా సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా కొద్ది రోజులు క్రితం సురడా గ్రామంలో చేతబడి అనుమానంతో గ్రామస్తులు ఒకరిని హత్యచేసి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మృత దేహాన్ని కాల్చి బూడిద చేసిన ఘటనలో 10 మందిని సురడా పోలీసులు అరెస్టు చేసి జైలుకి తరలించారు. మూడు నెలల క్రితం కుదలా పోలీసుస్టేషన్ పరిధి చెచన్యా గ్రామంలో చేతబడి చేస్తున్నాడని అనుమానంతో ఇద్దరిని గ్రామస్తులు గ్రామంలో స్తంభానికి కట్టి నోటిలో ముందరి పళ్లు తొలగించడమే కాకుండా, మూత్రం తాగించారు. దీనిని అడ్డుకోవడానికి పోలీసులు గ్రామంలోకి రాగా వారిని సైతం బంధించారు. ఫలితంగా పరిస్థితి ఉద్రిక్తం కావడంతో ఉన్నత అధికారుల ఆదేశాలతో అదనపు బలగాలను గ్రామంలోకి మోహరించి, బంధించిన పోలీసులను విడిపించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది.

చైతన్య శిబిరాలు

ఈ ఘటనలపై గంజాం ఎస్పీ జగ్‌మోహన్ మీన స్పందిస్తూ ఆదివాసీ గ్రామాల్లో ఈ మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్యపరిచే విధంగా శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. రాజకీయ నాయకులు సైతం చేతబడులను ఆశ్రయిస్తుండడం బాధాకరమన్నారు. అటువంటి వాటిపై పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని సూచించారు.



సురడా గ్రామంలో చేతబడి అనుమానంతో మంచం తిప్పుతున్న గ్రామస్తులు



గుల్లా రఘునాథ్‌పూర్‌లో బాలుడిని వేపాకులతో మంత్రిస్తున్న మంత్రగాడు

మంత్రాలకు చింతకాయలా..?

రాష్ట్రంలో అతి పెద్దదైన గంజాం జిల్లాలోని ఆదివాసీ గ్రామాలతో పాటు నగరానికి దగ్గరలో ఉన్న వివిధ గ్రామాల్లోని ప్రజలు జ్వరం, మశూచి, కలర వంటి వ్యాధులు వస్తే ప్రజలు ఆస్పత్రులకు వెళ్లకుండా, మంత్రగాళ్ల వద్దకు వెళ్తుంటారు. వ్యాధి నయమయ్యే వరకు కోళ్లు, మేకలు వంటి జంతు బలులు కూడా ఇస్తుంటారు. చేతబడి చేస్తున్నారనే అనుమానంతో పలువురిని హత్యలు చేయడం జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల అనుమానంతో గుండు గీయడంతో పాటు నోటిలో పళ్లు తొలగిస్తున్నారు. అదేవిధంగా మనిషి మలాన్ని నోటిలో కుక్కి కొడుతున్న సంఘటనలు పదుల సంఖ్యలో ఉన్నాయి.



గ్రామస్తుల చేతిలో దెబ్బలుతిన్న మంత్రగాడు

ఘోరం..!

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి
- 12 మందికి గాయాలు
- మృతులకు రూ.3 లక్షల ఎక్స్‌గ్రేషియా: సీఎం నవీన్ పట్నాయక్



ప్రమాదానికి గురైన ట్రక్కు

భువనేశ్వర్: మయూర్‌భంజ్ జిల్లా 49వ నంబర్ జాతీయ రహదారి బంగిరిపోసి సమీపంలోని ద్వారొషణి ఘాట్ ప్రాంతంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. భారీ వర్షంలో జాత్రా (జానపద నాటక మండలి) బృందంతో వెళ్తున్న ట్రక్కు బోల్తా పడడంతో 6గురు మృత్యువాత పడ్డారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. మయూర్‌భంజ్ జిల్లా రాయ్‌రంగ్‌పూర్ నుంచి బాలాసోర్ జిల్లా జలేశ్వర్‌కు వెళ్లే మార్గంలో ఘాటీ రహదారిపై ట్రక్కు మలుపు తిప్పే సమయంలో అదుపు తప్పడంతో బోల్తా పడినట్లు తెలుస్తోంది. ట్రక్కులోని ధౌలీ జానపద నాటక మండలి లైట్లు, ఇతర వాయిద్యాలు దెబ్బతిన్నాయి.

ముమ్మరంగా సహాయక చర్యలు

సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ చర్యల్లో అగ్నిమాపక దళం జవాన్‌లు పాలుపంచుకున్నారు. ట్రక్కు కింద చిక్కుకున్న బాధితులను ఆదుకోవడానికి ప్రయత్నాలు చేశారు. బాధితులను హుటాహుటిన అందుబాటులో ఉన్న బంగిరిపోసి ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం సత్వర చికిత్స కోసం బరిపద పండిత్ రఘునాథ్ ముర్ము వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరగడంతో ట్రక్కు డ్రైవర్ ఘటనా స్థలంలో జాడ లేకుండా పరారయ్యాడు. తప్పించుకున్న డ్రైవర్ కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారి తెలిపారు.

సీఎం సంతాపం

రోడ్డు ప్రమాదంలో 6 మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తీవ్ర సంతాపం దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల బంధువులకు రూ.3 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. దీంతో పాటు క్షతగాత్రులకు తగిన వైద్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న మంత్రి సుదాం మరండి

- మంత్రి సుదాం మరండి

కొరాపుట్: విద్యార్థులు క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంత్రి సుదాం మరండి పిలుపునిచ్చారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మండయ్ మైదానంలో అమొ ఒడిశా–నవీన్ ఒడిశా ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులను చైతన్యపరచడానికి క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లా స్థాయి ముగింపు కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరవ్వడంపై అభినందనలు తెలియజేశారు. ఇదే కార్యక్రమంలో 5టీ చైర్మన్ వి.కార్తికేయ పాండ్యన్ వర్చువల్ విధానంలో విద్యార్థులతో సంభాషించారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ విద్యార్థుల భవిష్యత్ కోసం నూతన దృక్పథంలో ముందుకు వెళ్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ కమలోచన్ మిశ్రా, రాష్ట్ర స్వతంత్ర మండలి సలహాదారుడు ప్రదీప్ మజ్జి, నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని, డాబుగాం ఎమ్మెల్యే మనోహర్ రంధారి, జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్ చంద్ర మజ్జి, జిల్లా పరిషత్ అధ్యక్షుడు మెతిరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

6 క్వింటాళ్ల గంజాయి పట్టివేత



లారీలో గంజాయి ప్యాకెట్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితిలో మంగళవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో లారీలో అక్రమంగా తరలిస్తున్న 6 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జిల్లా కేంద్రం నుంచి తవుడు లోడ్‌తో లారీ వెళ్తోంది. దీంతో కలిమెల అగ్నిమాపక కేంద్రం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు ఆపి తనిఖీలు నిర్వహించారు. లారీలో కేవలం తవుడు మాత్రమే ఉన్నట్లు డ్రైవర్ తెలియజేశాడు. కానీ పోలీసులు లారీ దిగువ భాగంలో ఏర్పాటు చేసిన క్యాబిన్‌ను గుర్తించి ప్రశ్నించారు. దానిని తెరిచి చూడగా గంజాయి బయటపడింది. దీంతో ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వీరు గంజాయిని హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన 6 క్వింటాళ్ల 36 కేజీల గంజాయి విలువ సుమారు రూ.90 లక్షలు ఉంటుందని ఎస్పీ నితీష్ వాద్వానీ తెలియజేశాడు. నిందితుల వద్ద నుంచి రూ.5 వేల నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.



అరెస్టు చేసిన నిందితులను చూపిస్తున్న పోలీసులు

నేటి నుంచి సాగర సంబరాలు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కీర్తి వాసన్ తదితరులు

బరంపురం: అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందిన గోపాల్‌పూర్ తీరంలో గురువారం నుంచి ఈనెల 28వ తేదీ వరకు సాగర సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ కీర్తి వాసన్ తెలియజేశారు. ఈ మేరకు బరంపురం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వైభవంగా సంబరాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా పల్లెశ్రీ మేళ, పుస్తక మేళ సైతం జరుగుతుందని తెలియజేశారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల నుంచి ఎస్ఎస్‌జీ గ్రూపు మహిళల ద్వారా తయారు చేసిన హస్తకళ వస్తువుల అమ్మకాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. వీటి ద్వారా ఒక జిల్లా నుంచి మరొక జిల్లాకు ప్రత్యేక సంబంధాలు ఏర్పడతాయని చెప్పారు. గంజాం జిల్లా కళా సంస్కృతిని పరిరక్షించడం సంబరాల ముఖ్య ఉద్దేశమని తెలియజేశారు. స్థానిక కళాకారులతో పాటు బోలీవుడ్, ఒలీవుడ్ కళాకారులు కూడా పాల్గొని తమ సంగీత గీతాలతో ప్రదర్శనలతో వివిధ సంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలో బీఎంసీ కమిషనర్ సోనా జెన్నా, బరంపుర సబ్–కలెక్టర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం



అరెస్టైన వ్యాన్ డ్రైవర్

బరంపురం: జిల్లా సరిహద్దులో అక్రమంగా తరలిస్తున్న కలపను అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం ఉదయం జిల్లా సరిహద్దు గుముసుర డివిజన్ నుంచి వ్యాన్ అక్రమంగా కలప రవాణా చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అటువైపు వస్తున్న వ్యాన్‌లో తనిఖీలు నిర్వహించి కలపను స్వాధీనం చేసుకున్నారు. వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌ను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని అధికారులు తెలియజేశారు.



సీజ్ చేసిన వ్యాన్‌లో కలప దుంగలు

క్లుప్తంగా

వైద్యమందక జింక మృతి



మరణించిన జింక

జయపురం: సబ్ డివిజన్ పరిధి బొయిపరిగుడ సమితి పశు చికిత్సాలయంలో సరైన వైద్యమందక జింక మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. బొయిపరిగుడ సమితి గుండాగుడ గ్రామంలోకి మంగళవారం గర్భందాల్చిన జింక వచ్చింది. దీంతో గ్రామస్తులు పట్టుకొని అటవీ అధికారులకు అప్పగించారు. అటవీ అధికారి సందీప్ పాణిగ్రాహి, ఫారెస్టర్ లలిత హరిజన్‌లు తమ సిబ్బందితో వచ్చి గాయపడిన జింకను తీసుకొని, వైద్యం అందించేందుకు బొయిపరిగుడ పశు చికిత్స కేంద్రానికి తీసుకొని వెళ్లారు. అయితే ఆస్పత్రిలో డాక్టర్ సెలవులో ఉండడంతో సిబ్బంది వైద్యమందించారు. కాగా చికిత్స అనంతరం జింక మరణించింది. దీంతో ఆ గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. గర్భంతో ఉన్నటువంటి జింకకు తగిన వైద్యం చేయకపోవడం వలనే మరణించిందని ఆరోపించారు. దీంతో పోస్టుమార్టం నివేదిక వచ్చాక ఎందుకు చనిపోయిందో తెలుస్తుందని అటవీ విభాగ అధికారులు ప్రజలకు శాంతిపజేశారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

రాయగడ: ఒక చోరీ కేసుకు సంబంధించి ఐదుగురు నిందితులను జిల్లాలోని అంబొదల పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అంబొదల గ్రామంలోని రైల్వే కాలనీలో నివసిస్తున్న రామకృష్ణ చౌదరి అనే వ్యక్తి ఇంట్లో ఈనెల 23వ తేదీన చోరీ జరిగింది. దీనిపై బాధితుడు పోలీసుస్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు 24 గంటల్లోనే నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అరెస్టైన వారిలో అదే గ్రామానికి చెందిన కైలాస్ పాత్రో, శంకర్ కంద, సుదర్శనరావు, జుదిష్టిర్ సాహు, పురుషోత్తం హాతిలు ఉన్నారు. వీరి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ సిలండర్, గ్యాస్ స్టవ్, టీవీ, ల్యూమినస్ బ్యాటరీ తదితర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను బుధవారం సాయంత్రం కోర్టుకు తరలించారు.

ఫిబ్రవరి 25 నుంచి మెయిన్స్ పరీక్ష

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసెస్ కమిషన్ (ఓపీఎస్‌సీ) ఆధ్వర్యంలో జరిగే ఒడిశా సివిల్ సర్వీసెస్ మెయిన్స్ (రాత) పరీక్ష – 2022 ఈ ఏడాది ఫిబ్రవరి 25 నుంచి నిర్వహించాలని నిర్ణయించింది. ఈ పరీక్షలు మార్చి 3వ తేదీ వరకు కొనసాగుతాయి. ఫిబ్రవరి 27, 29, మార్చి 2వ తేదీల్లో ఎలాంటి పరీక్షలు ఉండవని కమిషన్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.


వైద్య శిబిరం



వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: జట్నీ నాగరిక కమిటీ స్థానిక మోజట్నీ ప్రాంగణంలో వైద్య శిబిరం బుధవారం నిర్వహించింది. దివంగత వార్డు కార్పొరేటర్ సువేందు పరిజా జ్ఞాపకార్థం ఈ శిబిరం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే సురేష్ కుమార్ రౌత్రాయ్ ఈ శిబిరం ప్రారంభించారు. మొత్తం 459 మంది ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. భువనేశ్వర్ సమ్ అల్టిమేటమ్ ఆస్పత్రి వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. మెడిసిన్ డిపార్ట్‌మెంట్, చర్మం, పల్మోనాలజీ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. మెడిసిన్ విభాగం శిబిరంలో రోగులకు మందులు ఉచితంగా అందజేశారు. ఈ విభాగంలో అత్యధికంగా 260 మంది, చర్మ రోగాల వర్గంలో 160 మంది, పల్మోనాలజీ విభాగంలో 40 మంది ఉచిత ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు.

హైదరాబాద్‌లో కొవ్వాడ వాసి మృతి



పోతయ్య(ఫైల్)

రణస్థలం: కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య(23) హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోతయ్య టోపీల వ్యాపారం నిమిత్తం హైదరాబాద్‌లో కుటుంబంతో పాటు నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు పక్కన టోపీలు అమ్మేందుకు బైక్‌పై బయలుదేరి వెళుతుండగా టిప్పర్ లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోతయ్యకు భార్య రాములమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాంగ్రెస్ గూటికి బలభద్ర మాఝి



బలభద్ర మాఝిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

భువనేశ్వర్: రెండు వారాల క్రితం బిజూ జనతా దళ్‌ను వీడిన మాజీ మంత్రి బలభద్ర మాఝి బుధవారం కాంగ్రెసు గూటికి చేరారు. ఆయన వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి ప్రజాదరణ కలిగిన నాయకుడు కావడం విశేషం. భవానీపట్నలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జి డాక్టర్ అజయ్ కుమార్, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ తదితర ప్రముఖుల సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన తన మద్దతుదారులతో భారీ ఊరేగింపుగా కార్యక్రమ వేదిక వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు భక్తదాస్, ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతి, సంతోష్ సింగ్ సలూజా తదితరులు పాల్గొన్నారు. బలభద్ర మాఝి చేరికతో కలహండి జిల్లాలో పార్టీ మరింత బలోపేతమవుతుందని పీసీసీ అధ్యక్షుడు శరత్ పట్నాయక్ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదీ నేపథ్యం..

బలభద్ర మాఝి జనతా దళ్ (జేడీ) టిక్కెట్‌పై నౌర్లా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 1990 సంవత్సరంలో తొలిసారి రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. అనంతరం 1995లో మరోసారి విజయం సాధించారు. తదుపరి 2000, 2004లో జరిగిన ఎన్నికల్లో బిజూ జనతా దళ్ టిక్కెట్‌పై ఎమ్మెల్యే అయ్యారు. అతను 2002 నుంచి 2006 వరకు నవీన్ పట్నాయక్ కొలువులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అభివృద్ధి మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. ఈనెల 8న బిజూ జనతా దళ్‌కి రాజీనామా చేశారు. ఈ నిర్ణయం వెనుక కారణం స్పష్టం చేయకున్నా, పార్టీలో క్రియాశీలక సభ్యుడిగా ఉన్నప్పటికీ తనను పక్కన పెట్టారని ఆరోపించారు. ముఖ్యమంత్రిని కలిసేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా అనుమతించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 సంవత్సరం నుంచి పార్టీలో తనను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఆయన చివరిసారిగా 2014 ఎన్నికల్లో గిరిజనులు అధికంగా ఉండే కలహండి జిల్లా లంజిగఢ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. అయితే 2019 సంవత్సరంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి ప్రస్తుత ఎమ్మెల్యే ప్రదీప్ కుమార్ దిషారీని బీజేడీ రంగంలోకి దించింది.

'ఇళ్లపట్టాలు మంజూరు చేయాలి'



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లాలో తితిలీ తుఫాన్ ప్రభావంతో నిరాశ్రయులైన ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివాసీలతో కలిసి కలెక్టరేట్ వద్ద బుధవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరాశ్రయులైన ఎస్సీ, ఎస్టీలకు సైతం పట్టాలు అందజేయాలని కోరారు. ఈ విషయంపై కొన్ని నెలలుగా అర్జీలు పెడుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే ఇకపై ధర్నాలు చేయకుండా బంజరు భూములు స్వాధీనం చేసుకుంటామని బీకేఎంయూ జిల్లా కార్యదర్శి జొన్న సుభాష్ చంద్రరావు పేర్కొన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ అలోక్ కుమార్ ప్రధాన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ అధ్యక్షుడు ఎం.జగన్నాథరావు, కాశీనగర్, గుమ్మా గ్రామాల ఆదివాసీలు పాల్గొన్నారు.



ఆదివాసీలతో కలిసి ధర్నా చేపడుతున్న బీకేఎంయూ సభ్యులు

గణతంత్ర వేడుకలకు సమాయత్తం



జయపురం: ప్రాక్టీసులో పాల్గొన్న బాలికల టీమ్




బరంపురం: రిహార్సల్స్ చేస్తున్న రిజర్వ్ పోలీసులు



బరంపురం: కవాతు నిర్వహిస్తున్న విద్యార్థినులు



జయపురం: మైదానంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న అధికారులు



బరంపురం: విద్యార్థులకు సూచనలిస్తున్న కమాండర్ నిరద్ కుమార్ పాలయి

బరంపురం: గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని స్థానిక కల్లికోట్ కళాశాల మైదానంలో వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన ఎన్‌సీసీ, ఎర్విలంగ్, నేవల్, ఆర్మీ వింగ్ బృందాలు పరేడ్ రిహార్సల్స్ బుధవారం చేపట్టారు. కమాండర్ నిరద్ కుమార్ పాలయి వీరికి నాయకత్వం వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండర్ బిక్రమ్ రంజన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

జయపురం: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనే పరేడ్ టీముల ప్రాక్టీస్ బుధవారంతో ముగిసింది. ప్రాక్టీసులో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థుల టీములు పాల్గొన్నాయి. అలాగే విక్రమ్ క్రీడా మైదానంలో జరగనున్న వేడుకలకు సంబంధించి ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

18 మంది ఐపీఎస్‌ల బదిలీ

- జంట నగరాల పోలీస్ కమిషనర్‌గా సంజీబ్ పండా




సంజీబ్ పండా

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఐపీఎస్, ఓపీఎస్ కేడర్‌లో భారీ మార్పులు చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పునర్వ్యవస్థీకరణలో మొత్తం 18 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసి కొత్త పోస్టింగ్‌లు ఇచ్చారు. హోం శాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుత డైరెక్టర్ ఆఫ్ ఇంటెలిజెన్స్, ఓపీహెచ్‌డబ్ల్యూసీ సీఎండీ సంజీబ్ పండా భువనేశ్వర్–కటక్ జంట నగరాల పోలీస్ కమిషనర్‌గా నియమితులయ్యారు. అలాగే భువనేశ్వర్ –కటక్ జంట నగరాల ప్రస్తుత పోలీస్ కమిషనర్ సౌమేంద్ర కుమార్ ప్రియదర్శి ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌గా నియమించబడ్డారు. హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి సంతోష్ బాలాకి ఓపీహెచ్‌డబ్ల్యూసీ సీఎండీ అదనపు బాధ్యతలు కేటాయించారు. పూరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డాక్టర్ కన్వర్ విశాల్ సింగ్ కటక్ డీసీపీగా నియమితులయ్యారు. కటక్ డీసీపీ పినాక్ మిశ్రాను బదిలీ చేసి పూరీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమించారు. బాలాసోర్ ఐజీపీ(తూర్పు) హిమాన్షు కుమార్ లాల్ ఐసంబల్‌పూర్ ఉత్తరకు బదిలీ చేయబడ్డారు. ఐసంబల్‌పూర్ ఐజీపీ (ఉత్తర) డాక్టర్ దీపక్ కుమార్ తాల్చేరు ఐజీపీగా నియమితులయ్యారు. ఆయనకు అంగుల్ పీటీసీ ప్రిన్సిపల్‌గా అదనపు బాధ్యతలు కేటాయించారు. ప్రస్తుత బరంపురం ఐజీపీ (దక్షిణ) సత్యబ్రత భోయ్‌ని బదిలీ చేసి ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా నియమించారు. ప్రస్తుత ఐజీ (ఆర్థిక నేరాలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్) జె.ఎన్.పంకజ్‌ని బదిలీ చేసి బరంపురం ఐజీపీ (దక్షిణ)గా నియమించారు. దీంతో ఐజీ (ఆర్థిక నేరాలు, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్)గా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సి ఉంటుందని ఉత్తర్వులు పేర్కొన్నాయి. ప్రస్తుతం కటక్ డీసీపీగా ఉన్న పినాక్ మిశ్రా పూరీ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత ఏఐజీపీ (ప్రధాన కార్యాలయం) బానోత్ జుగల్ కిషోర్ కుమార్ కేంద్రాపడా పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమించబడ్డారు. కేంద్రాపడా పోలీస్ సూపరింటెండెంట్ మద్కర్ సందీప్ సంపత్ ఢెంకనాల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. రాయగడ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ వివేకానంద శర్మ రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ఏఐజీపీగా నియమితులయ్యారు. ఢెంకనాల్ జిల్లా పోలీసు సూపరింటెండెంట్ జ్ఞాన రంజన్ మహాపాత్రోను భువనేశ్వర్ స్పెషల్ బ్రాంచ్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమించారు. సోన్‌పూర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, ఓపీఎస్ అధికారి అమరేష్ కుమార్ పండా రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం ఏఐజీపీగా బదిలీ అయ్యారు. ఓపీఎస్ అధికారి, దేవ్‌గడ్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పి.కె.మిశ్రాని రౌర్కెలా రైల్వే పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్ఆర్‌పీ)గా నియమించారు. ఓపీఎస్ అధికారి, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, స్పెషల్ బ్రాంచ్ రామ ప్రసాద్ సాహుని దేవ్‌గడ్ పోలీస్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. జయపురం ఎస్‌డీపీవో హరీషా బి.సి రాయగడ పోలీస్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. బలిగుడ ఎస్‌డీపీవో యశ్‌ప్రతాప్ శ్రీమాల్ సోన్‌పూర్ జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బదిలీ అయ్యారు.

2 రోజులు తేలికపాటి వర్షాలు

భువనేశ్వర్: రాష్ట్రంలో మరో రెండు రోజుల పాటు పలుచోట్ల తేలికపాటి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ కార్యాలయం తెలియజేసింది. గత 24 గంటల్లో ఉత్తర ఒడిశాలో చాలా చోట్ల, దక్షిణ ఒడిశాలో కొన్ని చోట్ల ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అదే సమయంలో బుధవారం ఉదయం ఒడిశాలో ఒకటి రెండు చోట్ల దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దక్షిణ అంతర్ ఒడిశా జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల కనిష్ట ఉష్ణోగ్రతల్లో గణనీయమైన తగ్గుదల నమోదు అయింది. ఉత్తర కోస్తా ఒడిశాలోని కొన్ని ప్రదేశాలు, ఉత్తర అంతర్ ఒడిశాలో ఒకటి, రెండు చోట్ల గణనీయమైన పెరుగుదల నమోదయ్యింది. మల్కన్‌గిరిలో అత్యధిక గరిష్ట ఉష్ణోగ్రత 31.2 డిగ్రీల సెల్సియస్, సుందర్‌గడ్‌లో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 11.6 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రాగల 24 గంటల్లో కలహండి, బొలంగీర్, కంధమల్, సోన్‌పూర్, బౌధ్, బర్‌గడ్, సంబల్‌పూర్, అంగుల్, ఢెంకనాల్, నయాగఢ్, కటక్, జాజ్‌పూర్, దేవ్‌గడ్, కెంఝొహర్, సుందర్‌గఢ్ మరియు ఝార్సుగుడ జిల్లాల్లో ఒకటి రెండు చోట్ల దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉంది. అంతర్ ఒడిశా కొన్ని ప్రదేశాలు, కోస్తా ఒడిశాలో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి పొగమంచు కమ్ముకుంటుంది. జగత్‌సింగ్‌పూర్, కేంద్రాపడా, పూరీ, గంజాం, గజపతి, కంధమల్, రాయగడ, కొరాపుట్ జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని ఈ కేంద్రం సమాచారం. తదుపరి పొడి వాతావరణం అలముకుని ఉంటుంది.

వంశధార జలాలను ఇచ్ఛాపురానికి తరలించాలి



మాట్లాడుతున్న ఈఏఎస్ శర్మ

కంచిలి: వంశధార జలాలను ఇచ్ఛాపురం వరకు తరలించాలని రిటైర్డు ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు నియోజకవర్గ రైతు కులం ఆధ్వర్యంలో వంశధార జలాలతోనే రైతు బతుకులకు వెలుగు అనే అంశంపై కంచిలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లాలో వంశధార రెండో ఫేజ్ ఏర్పాటుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా సీఎం జగన్ ఒడిశా ప్రభుత్వంతో రెండుసార్లు చర్చించారని, వారు అంగీకరించకపోవడంతో ఎత్తిపోతల పథకాలను ఏర్పాటు చేసి, వంశధార జలాలను తరలించడానికి ప్రతిపాదన చేశారని వివరించారు. ఇది కార్యరూపం దాల్చేందుకు స్థానిక ప్రజాప్రతినిధులద్వారా ఒత్తిడి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, రిటైర్డు డీఎస్పీ శమ్మక్ల ప్రసాద్, వైద్యులు పి.శివాజీ, వై.కృష్ణమూర్తి, నేతలు నర్తు నరేంద్ర, ఇప్పిలి కృష్ణారావు, మంగి గణపతి, దేశెట్టి దాలిబంధు, కాళ్ల ధర్మారావు, కృష్ణారావు, దట్టి అజయ్, ఇందుగు సీతారాం తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



కలెక్టర్ అక్తర్‌కు మొమెంటో అందజేస్తున్న నాయకులు

కొరాపుట్: విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని పలువురు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా నుంచి అనుగుల్ జిల్లాకు బదిలీ అయిన కలెక్టర్ అబ్దుల్ మహ్మద్ అక్తర్‌కు అభినందన సభ బుధవారం నిర్వహించారు. అక్తర్ హయాంలో జిల్లాలో పర్యాటక రంగం విపరీతంగా అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కో–ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం పొడాల్, పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాడీ, లక్ష్మీపూర్ ఎమ్మెల్యే ప్రభుజానీ, సునాబెడా పురపాలక సంఘ అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్‌పై వేటు

- నిరుద్యోగులకు రూ.24 లక్షల టోకరాపై 'సాక్షి' కథనం
- వాస్తవమేనని తేలడంతో తొలగిస్తూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు



శ్రీకాకుళం క్రైమ్ : కోర్టులో ఉద్యోగాలిప్పిస్తామని నమ్మబలికి నాలుగేళ్ల క్రితం జిల్లాకు చెందిన నిరుద్యోగుల నుంచి రూ.24 లక్షలకు టోకరా వేసిన పోలీస్ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ అంశానికి సంబంధించి గతేడాది జూన్ 6న సాక్షిలో వచ్చిన 'కొలువు పేరిట టోకరా' కథనానికి స్పందించిన ఎస్పీ జి.ఆర్.రాధిక విచారణకు విజిలెన్స్ పోలీసులను ఆదేశించారు. విచారణలో నిజనిర్ధారణ కావడంతో గతేడాది డిసెంబరు మొదటివారంలో విజయవాడలోని ఉన్నతాధికారులకు జిల్లా ఎస్పీ విచారణ నివేదిక పంపించారు. దీనిపై సమీక్షించిన ఉన్నతాధికారులు తొలగింపు ఉత్తర్వులకు ఆర్డర్ వేయడంతో నందిగాంలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ కోలా రాజును విధుల నుంచి తప్పించారు. 2019 ఆగస్టులో ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోలా రాజు శ్రీకాకుళం రూరల్ మండలంలోని వాకలవలసకు చెందిన కంచరాన పుణ్యవర్ధనరావు, చింతాడ సురేష్, పేడాడ లక్ష్మణరావు, తమ్మినేని మణితేజ, పొందూరు మండలం కింతలికి చెందిన ఎన్ని హేమసుందర్, ఆమదాలవలస మండలం పొన్నంపేటకు చెందిన ఇప్పిలి శశికుమార్‌లను కోర్టులో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మబలికి అందరి వద్దా రూ.24 లక్షలకు వసూలు చేశాడు. సంవత్సరం గడిచినా ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

ఆర్మీ సుబేదార్ మృతికి సంతాపం



కైలాసరావు భౌతికకాయానికి సెల్యూట్ చేస్తున్న ఆర్మీ జవాన్లు

కొత్తూరు: ఆర్మీ సుబేదార్‌గా పనిచేస్తున్న మెట్టూరుకు చెందిన పెద్దమండి కైలాసరావు (38) బుధవారం తన నివాసంలో అనారోగ్యంతో మృతి చెందారు. జమ్మూకాశ్మీర్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఈయన సెలవుపై స్వగ్రామం వచ్చారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. ఈయనకు భార్య సంతోషికుమారి, పిల్లలు వరుణ్, నరీన్ ఉన్నారు. కైలాసరావు మృతి చెందడంతో సుబేదార్ హరికృష్ణ, ఆర్మీజవాన్‌లు గ్రామానికి చేరుకుని సైనిక లాంఛనాలతో దహన సంస్కరణలు నిర్వహించారు.

ఆదిత్యుని సన్నిధిలో ఫైర్ సర్వీసెస్ ఏడీ

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఫైర్ సర్వీసెస్ అడిషినల్ డైరెక్టర్ జ్ఞాన సుందరం బుధవారం దర్శించుకున్నారు. ఈయన వెంట జిల్లా ఫైర్ సర్వీసెస్ అధికారి జె.మోహనరావు, అడిషినల్ డీఎఫ్‌వో ఎం.వరప్రసాద్ ఉన్నారు.



జ్ఞానసుందరానికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

ఎనిమిదేళ్ల చిన్నారిపై తాతయ్య లైంగికదాడి

కోటబొమ్మాళి: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు తన మనుమరాలైన ఎనిమిదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లి బుధవారం టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డికి ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలిక తలిదండ్రులు ఒక ఇంటిలో, తాతయ్య నాన్నమ్మలు కలిసి మరో ఇంటిలో ఉంటున్నారు. ఈ నెల 19న బాలిక తాతయ్య ఇంటికి వెళ్లగా లైంగికదాడికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావమైన బాలిక ఇటీవల అనారోగ్యానికి గురవ్వడంతో బుధవారం చికిత్సనిమిత్తం టెక్కలి ఆస్పత్రికి తీసుకువెళ్ల విషయం బయటపడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై డీఎస్పీ బుధవారం కొత్తపేటకు వచ్చి విచారణ చేపట్టారు. వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ మహమ్మద్ అలీ తెలిపారు.

నకిలీ బెంతో ఒరియాలను గిరిజనుల్లో చేర్చవద్దు



గిరిజనులతో మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: బెంతో ఒరియా కులస్తులు శ్రీకాకుళం జిల్లాలో లేరని, నకిలీ బెంతో ఒరియాలను గిరిజనులలో చేర్చవద్దని కోరుతూ బుధవారం గిరిజనులు పెద్ద ఎత్తున పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ర్యాలీ చేపట్టారు. కాశీబుగ్గ పాత జాతీయ రహదారి నుంచి పలాస వరకు ర్యాలీగా వెళ్లి ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. మార్గమధ్యలో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గిరిజనులను మర్యాదపూర్వకంగా కలిసి సంఘీభావం తెలిపారు. గిరిజనులలో ఇతర కులాలను చేర్చడం అనేది ముందు ప్రభుత్వాలు చేసిన ప్రతిపాదనలే తప్ప సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసినది కాదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు సవర జగన్నాయకులు, జిల్లా జేఏసీ అధ్యక్షుడు సవర రాంబాబు, ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, పలాస ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, మందస మండల అధ్యక్షుడు ఎస్.జగన్, గణేష్, లోకనాథం, రామారావు, సిద్ధు, కృష్ణారావు, యోగి, లక్ష్మినారాయణ, హేమలత, పోలయ్య, దేవేంద్ర, పురందేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కార్పెంటర్ మృతిపై కేసు నమోదు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో కొమ్మోజు సత్తిబాబు(58) కార్పెంటర్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు కర్రలు కోసే మెషీన్ కింద పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం ఈ ప్రమాదం జరిగిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ మేరకు మృతుడి కుమారుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఎస్కోట సీహెచ్సీకి తరలించినట్లు సీఐ వి.చంద్రశేఖర్ బుధవారం తెలిపారు.

బెదిరించేందుకు గడ్డి మందు తాగి వ్యక్తి మృతి


శంకరరావు మృతదేహం

వీరఘట్టం: స్థానిక మందిరం వీధికి చెందిన ఆర్.శంకరరావు (28) భార్యను బెదిరించేందుకు గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఎం.గోవింద బుధవారం తెలిపారు. ఈ సంఘటనపై ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎఫ్సీఐ కలాసీగా పనిచేస్తున్న శంకరరావు ఇటీవల జరిగిన సంక్రాంతి పండగ సందర్భంగా ఎక్కువ మోతాదులో మద్యం తాగడంతో భార్య అనూష మండిపడింది.ఇంతలా మద్యం తాగితే ఆరోగ్యం ఏమైపోతుంది? నీ మీద ఆధారపడి ఇద్దరు చిన్నపిల్ల లు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కు అయి ఇలా మందు తాగడం కరెక్ట్ కాదని నిలదీసింది. దీంతో శంకరరావు ఈనెల 21న భార్యను బెదిరించేందుకు ఏం కాదులే అని కొద్దిగా గడ్డి మందు తీసుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు స్థానిక పీహెచ్సీకి అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్కు తరలించగా రిమ్స్లో చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.గోవింద చెప్పారు.

గుర్తు తెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: జిల్లాకేంద్రంలోని మరిశర్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తిని కేంద్రాస్పత్రికి తీసుకువచ్చేసరికి మృతిచెందాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు బుధవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తిని జిల్లా కేంద్రాస్పత్రికి స్థానికులు తరలించగా ఆస్పత్రికి వచ్చేసరికి క్షతగాత్రుడు మృతిచెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి పోలీసులు తరలించారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాలని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వాసుదేవ్ తెలిపారు.

రైలు ఢీకొని యువకుడు..

విజయనగరం క్రైమ్: స్థానిక సీఎంఆర్ షాపింగ్ మాల్ వెనుక రైల్వే ట్రాక్పై గుర్తు తెలియని యువకుడు మృతిచెందినట్లు జీఆర్పీ సిబ్బంది బుధవారం తెలిపారు. సుమారు 25 ఏళ్ల వయసు కలిగిన యువకుడిని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడని మృతుడి శరీరంపై నీలం రంగు అడ్డగీతల కలిగిన తెలుపు షర్ట్, ఆర్మీ డిజైన్ కలిగిన కట్ బనియన్, నల్లని జీన్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతుని చెవులకు చెవి పోగులున్నాయని, ఆచూకీ తెలిసిన వారు ఫోన్ 9666555214 నంబర్ను సంప్రదించాలని ఎస్సై రవివర్మ సూచించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎస్టీ కమిషన్ చైర్మన్కు మాతృవియోగం

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీశంకరరావు తల్లి దాడి చిలక మంగమ్మ (80) బుధవారం సాయంత్రం విజయనగరంలో మృతి చెందారు. అనారోగ్యంతో ఉన్న ఆమెను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చగా సాయంత్రం 4.30 గంటల సమయంలో ప్రాణం విడిచినట్లు ఎస్టీ కమిషన్ క్యాంప్ కార్యాలయం ప్రతినిధులు తెలిపారు. ఆమె పార్థివదేహాన్ని నగరంలోని కామాక్షినగర్లో ఉన్న ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు నివాసంలో ఉంచారు. మంగమ్మకు డాక్టర్ శంకరరావుతోపాటు ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్యామ్ కుమార్లున్నారు. గురువారం ఉదయం నగరంలోని కొత్తపేట స్వర్గధామంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల-రణస్థలం ప్రధాన రహదారిలో స్థానిక చంపావతి నది వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తితో పాటు గర్భిణికి పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామతీర్థం గ్రామానికి చెందిన దన్నాన రాంబాబు తన భార్య శ్యామలను వైద్యం నిమిత్తం ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా..కొత్తపేటకు చెందిన సూర్యనారాయణ ఇసుకలోడు వేసుకుని టైరు బండితో రాంగ్ రూట్లో వచ్చి ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో భార్యాభర్తలు కింద పడిపోవడంతో భర్త రాంబాబు ఛాతీ పైనుంచి ఇసుక బండి వెళ్లిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం రాంబాబును ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబసభ్యులు స్థానిక పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

ఘనంగా పోలమాంబ అనుపోత్సవం

• వనంగుడికి చేరిన అమ్మవారి ఘటాలు

మక్కువ:

ఉత్తరాంధ్ర ఇలవేల్పు, భక్తుల ఆరాధ్యదైవం శంబర పోలమాంబ అమ్మవారి అనుపోత్సవం బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం సాయంత్రం 3.51గంటలకు జన్నివారి ఇంటివద్ద పూజలందుకున్న అమ్మవారి ఘటాలు తిరువీధికి బయల్దేరి గిరిడవారు, పూడి, కుప్పిలి వారిళ్లకు వెళ్లి తొలి పూజలందుకుని అనంతరం గ్రామంలోని అన్నివీధుల్లో ఊరేగాయి. తిరిగి మంగళవారం అర్ధరాత్రి 12గంటల ప్రాంతంలో ప్రధానరహదారి వద్ద గల అమ్మవారి గద్దెకు ఘటాలు చేరుకున్నాయి. కాసేపు అమ్మవారు సేదతీరి తిరిగి తిరువీధికి బయల్దేరి, బుధవారం ఉదయం 9.20 గంటలకు ప్రధానాలయం సమీపంలో ఉన్న యాత్రాస్థలానికి చేరుకున్నాయి. ఈవో వి.వి.సూర్యనారాయణ, దేవాదాయశాఖ సిబ్బంది, మాజీ ట్రస్టీబోర్డు చైర్మన్లు పూడి దాలినాయుడు, వసంతుల భాస్కరరావు, గంజి కాశినాయుడు, ఎంపీటీసీ సభ్యుడు తీళ్ల పోలినాయుడు, ఉప సర్పంచ్ అల్లు వెంకటరమణ, రెవిన్నాయుడు, కరణం, కుప్పిలి, గిరిడ వారి కుటుంబసభ్యులు, గ్రామపెద్దలు, భక్తుల మధ్య అమ్మవారికి ఉయ్యాల కంబాల కార్యక్రమం నిర్వహించారు. యాత్రాస్థలం నుంచి సుమారు కిలోమీటర్ దూరంలో ఉన్న వనంగుడికి అమ్మవారి ఘటాలు బయల్దేరగా, వెనుక వందలాది మంది భక్తులు తరలివచ్చారు. వనంగుడి వద్దకు చేరుకున్న ఘటాలతో ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసిన అనంతరం వనంగుడిలో ఉంచగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ఘటాలకు పూజలు చేశారు. ఈనె30న పోలమాంబ అమ్మవారి మారుజాతర నిర్వహించనున్నారు.


అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులు


పెదపోలమాంబ ఆలయంలో ఉంచిన ఘటాలు


అమ్మవారి ఘటాలకు ఉయ్యాల కంబాల నిర్వహిస్తున్న దృశ్యం

జాతర ఆదాయం లెక్కింపు

శంబర పోలమాంబ అమ్మవారి తొలిజాతరలో వేలంపాటల ద్వారా, దర్శనం టిక్కెట్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని బుధవారం ప్రధానాలయంలో ఈవో వి.వి.సూర్యనారాయణ, మాజీ ట్రస్టీబోర్డు చైర్మన్లు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కించారు. శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.3,21,600, ప్రత్యేకదర్శనం టిక్కెట్ల రూ.1,39,440, కేశఖండన టిక్కెట్ల ద్వారా రూ.15,840, లడ్డూప్రసాదం ద్వారా రూ.1,71.375, పులిహోరప్రసాదం ద్వారా రూ.93,840, తలనీలాల టిక్కెట్ల వేలం ద్వారా రూ.3,33,500, కొబ్బరిముక్కల వేలంద్వారా రూ.4,18,100 వచ్చింది. చీరలు, రవికలు, ఇత్తడి సామగ్రి వేలం ద్వారా రూ.3,40,000 సమకూరింది. తొలిజాతర, మారు జాతరలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను ఈనెల 31వ తేదీన లెక్కించనున్నట్లు ఈవో సూర్యనారాయణ తెలిపారు. గత ఏడాది కంటే ఈఏడాది తొలిజాతర ఆదాయం రూ.2,60,245లు పెరిగిందని ఈఓ చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

బొబ్బిలి: శ్రీకాకుళం జిల్లా ఎల్ఎన్ పేట మండలం చిన్న కొల్లివలసకు చెందిన పెంకి అరుణ(33) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ సంఘటనపై బొబ్బిలి ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొంతకాలంగా ఆకలి లేకపోవడం, జ్వరంతో బాధపడుతున్న అరుణ తన పుట్టినిల్లయిన బొబ్బిలి మండలంలోని పెంట గ్రామానికి కొన్ని రోజుల క్రితం వచ్చింది. ఆమెకు ఒంట్లో బాగుండకపోవడంతో కన్నవారు బొబ్బిలిలోని ఆస్పత్రులకు తీసుకెళ్లారు.అయినా తగ్గకపోవడంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. చికిత్స చేసిన వైద్యులు మృతిపై అనుమానంతో పోలీసులకు సమాచారమిచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తిరిగి బొబ్బిలి సీహెచ్సీకి మృతదేహాన్ని తరలించారు. మృతురాలి తండ్రి అమలాపురం చినసత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ తెలిపారు. మృతురాలికి భర్త వెంకటరమణ, కుమారుడు నవీన్(17), కుమార్తె రమ్య(15) ఉన్నారు.

దళాయిపీట పంటపొలాల్లో గజరాజుల గుంపు

కొమరాడ: మండలంలోని నాగవళి నది ఆ వైపు గ్రామాలైన దళాయిపీట గ్రామ పరిసరాల్లో గజరాజులగుంపు చేరుకున్నాయి. సీమనాయుడు వలస కూడలి నుంచి తొడుము వైపు వెళ్లే రహదారిపై ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. ఏడు ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరిస్తోందని, రాత్రిపూట రైతులు పొలాల్లోకి వెళ్లరాదని హెచ్చరించారు.

చీటింగ్ కేసుల్లో రికవరీ చేయాలి


ఎస్పీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న నెల్లిమర్ల ఎస్సై రామగణేష్


నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

• నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: వివిధ పోలీస్స్టేషన్లలో నమోదైన చీటింగ్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా పూర్తిచేయాలని, నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి ఆస్తులను కూడా రికవరీ చేయాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్లల పనిచేస్తున్న పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని బుధవారం ఆమె పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే ఎన్నికల దృష్ట్యా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోగల క్రిటికల్ పోలింగ్ కేంద్రాలను, గ్రామాలను సందర్శించాలని, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో సమస్యలు సృష్టించేందుకు ఆస్కారం ఉన్న రౌడీషీటర్లను, వ్యక్తులను గ్రామస్థాయిలో గుర్తించి, వారిని బైండోవర్ చేసి, బాండ్లు తీసుకోవాలని సూచించారు.

పలు కేసులపై సమీక్ష

సమస్యాత్మక గ్రామాల్లో సమావేశాలు నిర్వహించాలని, శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అక్రమంగా మద్యం విక్రయించే వారిపైన, రవాణాకు పాల్పడే వారిపైన కఠినచర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎన్నికల దృష్ట్యా ఏర్పాటుచేసిన చెక్ పోస్టులను అధికారులు సందర్శించి, ఆకస్మిక తనిఖీలు చేయాలని, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రచారం కోసం అనుమతులు కోరుతూ వివిధ పార్టీల నాయకులు చేసే దరఖాస్తు వివరాలను నమోదుచేసేందుకు ప్రత్యేకంగా ఒక రిజిస్టర్ను ప్రారంభించాలని చెప్పారు. అనంతరం దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను సమీక్షించారు. వాటిపై దర్యాప్తు పూర్తిచేసేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వివిధ రకాల కేసుల నమోదు, పరిష్కారంలో ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. ప్రశంసపత్రాలు పొందిన వారిలో గజపతినగరం ఎస్హెచ్ఓగా బాధ్యతలు నిర్వహిస్తున్న ట్రెయినీ డీఎస్పీ ఎస్.మహేంద్ర, నెల్లిమర్ల ఎస్సై రామగణేష్, కొత్తవలస ఏఎస్సై యువరాజ్, స్పెషల్ బ్రాంచ్ హెచ్సీ జి.రామరాజు, వంగర హెచ్సీ డి.రాములు, విజయనగరం రూరల్ హెచ్సీ ఎం.అప్పారావు, ఇతర పోలీసు కానిస్టేబుల్స్, హోంగార్డ్స్ ఉన్నారు. నేర సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్ఈబీ డీఎస్ఎస్ఓ ఎస్.వెంకటరావు, ట్రెనీ ఐపీఎస్ మండ జావలి అల్ఫాన్స్, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంక్రాంతి కానుక

• మూడు డిపోల పరిధిలో 471 ప్రత్యేక బస్సుల సేవలు
• రూ.95.09 లక్షల ఆదాయం

జిల్లాలో సంక్రాంతి ఆదాయం ఇలా..

డిపో	బస్సులు	ఆదాయం
పాలకొండ	217	రూ.3654044
పార్వతీపురం	155	రూ.3860799
సాలూరు	99	రూ.1994937
మొత్తం	471	రూ.9509780


పార్వతీపురం డిపోలో ఆర్టీసీ బస్సులు

పార్వతీపురంటౌన్: సంక్రాంతి పండగకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడపడం ద్వారా పార్వతీపురం జిల్లా ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని పొందింది. జిల్లాలోని మూడు డిపోల ద్వారా ఈనెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేయగా పండగ ముందు, తర్వాత సాధారణ చార్జీలకే బస్సులు నడిపింది. ఈ ఏడాది పండగకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేయడానికి ఎక్కువమంది మొగ్గు చూపడంతో ఈ ఆదాయం సాధ్యమైంది. దీంతో ఆర్టీసీ ప్రయాణికులకు మరింత చేరువైంది.

పండగకు ముందు, తరువాత

సంక్రాంతి పండగ ముందు జనవరి 10 తేదీ నుంచి 16వ తేదీ వరకు హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం నుంచి జిల్లాకు మొత్తం 216 ప్రత్యేక బస్సులు సర్వీసుచేయగా రూ 44.86 లక్షల ఆదాయం లభించింది. అలాగే పండగ దరువాత 17వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లాలోని మూడు డిపోల నుంచి హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నానికి 255 ప్రత్యేక బస్సు సర్వీసులు చేయగా రూ.50.23లక్షల ఆదాయం లభించింది

'ఆదాయం లభించడం సంతోషం



సంక్రాంతి పండగకు ఆర్టీసీకి జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషం. పండగ సందర్భంగా ఆర్టీసీ బస్సులను ప్రయాణికులు బాగా ఆదరించారు. పండగకు ముందు, పండగ తరువాత కూడా ప్రత్యేక బస్సులను నడిపాం. అలాగే సాధారణ చార్జీలకే సర్వీసు చేశాం. ప్రయాణికులు ఇచ్చిన ప్రోత్సాహంతో మున్ముందు ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేలా చర్యలు చేపడతాం.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజా రవాణా అధికారి పార్వతీపురం మన్యం

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట

సంక్రాంతి పండగకు ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం సర్వసాధారణం. అయితే పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలు, ఆన్లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేలా చేసి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ బారినుంచి రక్షించింది.

జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు మ్యాపింగ్ తప్పనిసరి

• జాయింట్ కలెక్టర్ గోవిందరావు


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు

పార్వతీపురంటౌన్: జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లకు మ్యాపింగ్ తప్పనిసరి అని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్ట్ గోవిందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం తహసీల్దార్ కార్యాలయాన్ని పరి శీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 28న జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసే ఇళ్లకు మ్యాపింగ్ తప్పనిసరిగా ఉండాలని సిబ్బందికి సూచించారు. రెవెన్యూ సిబ్బంది ప్రతి ఒక్కరూ ఈ ప్రక్రియను చేపట్టాలని కోరారు. రిజిస్ట్రేషన్లకు సంబంధించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ రిజిస్ట్రేషన్కు సంబంధించిన వివరాలను 28వ తేదీలోగా సేకరించి మ్యాపింగ్ పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హేమలత, తహసీల్దార్ శివన్నారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

28న జానపద సాహితీ సౌరభం

విజయనగరం టౌన్: విజయభావన సాహితీమిత్ర సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న ఆదివారం సాయంత్రం గురజాడ స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆవరణలో జానపద సాహితీ సౌరభం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. జ్ఞానపథంలో జానపద సాహిత్యం అనే అంశంపై గిడుగు రామమూర్తి తెలుగు భాషపై జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రికూర్మారావు వక్తగా ప్రసంగిస్తారని, సాహితీవేత్తలందరూ తప్పక హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ వేగవంతం చేయాలి


లబ్ధిదారుకు ఆరోగ్యశ్రీ కార్డు అందిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

రాజాం సిటీ: ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీ వేగవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి సూచించారు. ఈ మేరకు బుధవారం ఆమె రాజాం మండల పరిధి బొద్దాం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని తనిఖీ చేసి కార్డుల పంపిణీపై ఆరా తీశారు. కార్డుల పంపిణీ నెమ్మదిగా జరుగుతుండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 5.2 లక్షల కార్డులు పంపిణీ చేయాల్సి ఉందని, ప్రస్తుతం 3.3 లక్షల కార్డులు వచ్చాయని వాటిని వీలైనంత త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే కార్డుల్లో మార్పులు చేర్పులతోపాటు కొత్తవారిని చేర్పించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆరోగ్యశ్రీ కార్డులతోపాటు కరపత్రాలను లబ్ధిదారులకు అందించాలని, అలాగే ఆరోగ్యశ్రీ యాప్ను డౌన్లోడ్ చేయించి బయోమెట్రిక్ తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఓ లబ్ధిదారుకు ఆమె కార్డును అందించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న కులగణన సర్వే ప్రక్రియను పరిశీలించి, వలంటీర్ల వద్ద ఆరా తీశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సుధారాణి, కులగణన నోడల్ ఆఫీసర్ కె.సందీప్, ఆర్డీఓ బి.శాంతకుమారి, తహసీల్దార్ ఎస్కే రాజు, ఎంపీడీఓ బాసూరి శంకరరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎంవీ నాగరాజు, వైస్ ఎంపీపీ నక్క వర్షిణి తదితరులు పాల్గొన్నారు.

స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ను బ్యాంకర్లు అనుసరించాలి


మాట్లాడుతున్న జేసీ మయూర్ అశోక్

విజయనగరం అర్బన్: వ్యవసాయ, అనుబంధ రంగాలైన మత్స్య, పశు, ఉద్యాన రంగాలలో రైతులకు రుణాలను మంజూరు చేసేటప్పుడు నిర్ణయించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారంగానే మంజూరు చేయాలని జేసీ మయూర్ అశోక్ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆయన కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో డీసీసీబీ ద్వారా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్పై పలు శాఖలకు చెందిన అధికారులతో చర్చించి నిర్ణయించారు. పాడి, మత్స్య, యూనిట్లకే కాకుండా ఇంకా ఏ రకాలైన రుణాలు ఇస్తున్నారో, వాటికి ఏ మేరకు రుణం అవసరం అవుతుంతో ఆయా అధికారులు ప్రతిపాదనలను డీసీసీబీకి అందజేయాలని ఆదేశించారు. ఆయిల్పామ్, అపరాల సాగు,పశుగ్రాసం తదితర యూనిట్లకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ను నిర్ణయించాలని కోరారు. డీసీసీబీ సీఈఓ కె.జనార్దన, ఎల్డీఎం ఎ.శ్రీనివాసరావు, వ్యవసాయ, మత్స్య ఉద్యాన పశు సంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ సి.విష్ణు చరణ్

• ఐటీడీఏ సి.విష్ణుచరణ్

పార్వతీపురంటౌన్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఐటీడీఏ సి.విష్ణు చరణ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని గిరిమిత్ర భవనంలో ఏర్పాటు చేసిన ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఐటీడీఏ పీఓ పాల్గొని మాట్లాడుతూ వ్యవసాయంపై ఆధారపడడం వల్ల ప్రపంచ ఆర్థికవ్యవస్థలో భారతదేశం 5వ స్థానంలో ఉందన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పారిశ్రామికవేత్తలు పెరగాలని ఆకాంక్షించారు. పరిశ్రమ పెట్టాలంటే మూలధనం అవసరమని, పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి భారత ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశం కలగాలంటే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పీఓ సూచించారు. దేశాభివృద్ధిలో వ్యవసాయంతో పాటు సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలు కూడా ముఖ్యమేనని పేర్కొన్నారు.

'ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలి

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకుని పారిశ్రామికవేత్తలు కావాలని పిలుపునిచ్చారు. అర్హత కలిగిన వారికి భారత ప్రభుత్వం మొదటి విడతగా 5 శాతం వడ్డీతో లక్ష రూపాయలు బ్యాంక్ ద్వారా రుణం అందజేస్తుందని తెలిపారు. తీసుకున్న రుణాన్ని 18 వాయిదాలలో తిరిగి బ్యాంక్లకు చెల్లించాలని, రెండవ విడతగా రూ.2 లక్షల రుణాన్ని అందిస్తుందని వివరించారు. పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ కరుణాకర్ మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం పనిచేస్తుందని చెప్పారు. 18 రకాల చేతి పనివారు ఉన్నారని వారికి ప్రభుత్వం 15 వేల రూపాయల విలువైన పనిముట్లను ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు

జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులందరికీ భారత ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ఆర్థిక సాయం చేస్తూ పారిశ్రామికవేత్తలుగా ఎదగడానికి తోడ్పాటు అందిస్తోందన్నారు. జిల్లాలో అర్హత ఉండి ఆర్థికంగా వెనకబడిన వారు సత్వరం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మన్యం జిల్లాను మాన్యం జిల్లాగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత జిల్లాలోని ఔత్సాహికవేత్తలపై ఉందన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ సహాయ పథక సంచాలకుడు సత్యం నాయుడు మాట్లాడుతూ చేతి వృత్తుల వారిని ప్రోత్సహించేలా ఈ పథకం ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి సాయికుమార్ మాట్లాడుతూ జిల్లాలో సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, సాలూరు, పార్వతీపురంలలో నాలుగు నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థలు ఉన్నాయని తెలిపారు. అక్కడ శిక్షణ తీసుకునే వారికీ ఉచితంగా వసతి, భోజనం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకానికి ఎంపికైన వారికి 5 నుంచి 7రోజులు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. వారికి ప్రోత్సాహకంగా రోజుకు రూ:500 భారత ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎస్సీ ప్రెసిడెంట్ పి.నాగకుమార్, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ ఆత్మహత్యపై దర్యాప్తు

కురుపాం: మండలంలోని గుమ్మ ఎండీయూ ఆపరేటర్ ఆత్మహత్యకు పాల్పడడానికి ముఖ్య కారణం అధికారులు, సేల్స్మన్ ఒత్తిడే కారణమని మృతుడు సీమల నూకయ్య(36) కుటుంబసభ్యులు ఆరోపించడంపై మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ స్పందించారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశించడంతో పాలకొండ ఆర్డీఓ ఎం.లావణ్య బుధవారం మృతుడి స్వగ్రామమైన మండలంలోని గుమ్మపంచాయతీ గుమ్మగదబవలస గ్రామానికి వెళ్లి దర్యాప్తు నిర్వహించారు. నూకయ్య భార్య జ్యోతి, ఇతర కుటుంబసభ్యులు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు.

పూర్తి నివేదికను జాయింట్ కలెక్టర్కు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ దర్యాప్తులో కురుపాం తహసీల్దార్ రమేష్కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న ఇద్దరు మహిళల అరెస్ట్

పాచిపెంట: అక్రమంగా సారా రవాణా చేస్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్ చేసినట్లు ఎస్సై నారాయణరావు బుధవారం తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ, మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద సారా తరలిస్తుండగా ఒడిశా రాష్ట్రంలోని లావిడికి చెందిన సుకురా, హంటర్లు పట్టుబడ్డారని తెలిపారు. వారి నుంచి 1000 సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, రిమాండ్కు తరలించామన్నారు.